# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం

తెలుగు దినపత్రిక

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

ASN NEWS

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి   తెలంగాణ - రంగారెడ్డి   సంపుటి : 01   సంచిక : 201   బుధవారం , ఆగస్టు 19, 2026 ,   పేజీలు - 12   వెల : 1 /-




## వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

- సామాన్యుడిగా వచ్చి..అసామాన్యుడిగా ఎదిగారు
- కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి

**విశాఖపట్నం,ఆగస్టు 18 :** కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ

మిగతా2లో...

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

- సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 18 :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మిగతా2లో...

## బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

- 22ఎ నిషేధిత జాబితా పేరుతో దోపిడీకి స్కెచ్
- రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



**హైదరాబాద్,ఆగస్టు 18 :** గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు.

మిగతా2లో...

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

- ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం
- 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి తప్పును సరిదిద్దుకుంటున్నాం
- మీడియాతో మంత్రి పొంగులేటి వివరణ


2లో


2లో

## ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి
- అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం
- సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

- క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం
- పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం
- 2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం
- హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్,ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిది ద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే

మిగతా2లో...



## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 18 :** 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని

మిగతా2లో...

## 22ఏ నిషేధిత జాబితాను వెంటనే ఎత్తేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలి
- పనిచేయని టోల్ ఫ్రీ నెంబర్ : ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



**ఉప్పల్,ఆగస్టు 18 :** భూము లు, ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రజలను ఇబ్బం దులకు గురిచేస్తున్న రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి వాజపేయినగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. మల్కాజిగిరిలో 60 ఏండ్ల నివాసిత ఇండ్లను కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఆందోళనకు గురిచేయడం సమంజసం కాదన్నారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని చెప్పారు. నిషేధిత జాబితాను వెంటనే తొలగించకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింపజేసేలా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో 7,500 జీవోల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో

మిగతా2లో...

# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చేయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

# 22ఏ నిషేధిత జాబితాను వెంటనే ఎత్తేయాలి

(మొదటి పేజీ తరువాయి)

6 వేలకుపైగా భూములతో పాటు హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు.ఎలాంటి దరఖాస్తులూ తీసుకోకుండా, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత మంత్రిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి చేసిన తప్పులపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా భూదందాకు పాల్పడ్డారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయన్నారు. ఈ అంశంపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణ భవన్‌లోని జనతా గ్యారేజీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు అక్కడికి రావాలని సూచించారు.ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిలిపివేయాలని, 22ఏ నిషేధిత జాబితా నుంచి ఆస్తులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితా విషయంలో ప్రభుత్వం రాత్రికి రాత్రే జీవోలు జారీ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, బద్దం పరుశు రాంరెడ్డి, వీరేష్‌యాదవ్, వెంకన్న, నందికంటి శ్రీధర్, ఖలీల్, కార్పొరేటర్ విజయశాంతి, రాము, సునీత యాదవ్, శిరీషారెడ్డి, జగదీష్‌గౌడ్, రామచందర్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు .పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# బిఆర్‌ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

(మొదటి పేజీ తరువాయి)

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

**హైదరాబాద్,ఆగస్టు 18 :** 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు.మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు.22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు.

చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఏఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

# వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి



**హైదరాబాద్,ఆగస్టు 18 :** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

**హైదరాబాద్,ఆగస్టు 18 :** ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగు తున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణెళి నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు.

# ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ..





**అచ్చంపేట:** భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్టు జలగం సురేందర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని విశ్వ ప్రగామి ట్రస్టు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన.. TPCC ఉపాధ్యక్షులు,ఐజజ అధ్యక్షులు &అచ్చంపేట MLA డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఈ కార్యక్రమం పై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ ఉచిత శిక్షణ కేంద్రం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందించడం ముందుగా వారిని అభినందించడం జరుగుతుంది.. ఈ నల్లమల్ల ప్రాంతంలో వెనుకబడిన యువత ఈ కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుంది.. తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ వివిధ మార్గాల ద్వారా ఉపాధి కల్పించడమే ఈ ప్రభుత్వ దేయం. ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాల బేసిక్ కంప్యూటర్స్ టాలీ విత్ జిఎస్టి, డిజిటల్ డిజిటల్ మార్కెటింగ్, ఆఫీసు ఆటోమేషన్, వంటి కార్యక్రమాలు నేర్పించడం జరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలలో ఉద్యోగులు మరియు చిన్న, అకౌంట్స్ మధ్యతరగతి వ్యాపార సమస్యలు టాలీ ఆపరేటర్లుగా పనిచేయడానికి వీలుంటుంది. కస్టమర్ కాల్ సెంటర్లలో ఈ ఉచిత కంప్యూటర్ నేర్చుకొని పని చేయడానికి యువతకు ఉపాధి పొందడానికి వీలుంటుంది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,NSUI నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఉచిత కంప్యూటర్ శిక్షణ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# శాసన మండలి ఎథిక్స్ కమిటీ (2026-27) ప్రాథమిక సమావేశం నిర్వహణ



శాసన మండలి ఎథిక్స్ కమిటీ (2026-27) ప్రాథమిక సమావేశం మంగళవారం కౌన్సిల్ కాన్ఫరెన్స్ హాల్‌లో శాసన మండలి ఛైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ ఛైర్మన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ డిప్యూటీ ఛైర్మన్ శ్రీ బండా ప్రకాష్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధుల ప్రవర్తనలో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయం, సమానత్వం వంటి విలువలను మరింత బలోపేతం చేయడమే ఎథిక్స్ కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలి సభ్యులు, అధికారులు, సిబ్బందికి నైతిక విలువలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేందుకు కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరూ ఎక్కడ ఉండాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, రాజకీయాల్లో సద్విమర్శ అవసరమే కానీ విమర్శలు హద్దులు దాటకూడదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, నైతిక ప్రమాణాల పరిరక్షణకు కమిటీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రతినిధుల ప్రధాన ధ్యేయంగా ఉండాలని, శాసనసభ మరియు శాసన మండలి సభ్యులు సమాజానికి ఆదర్శప్రాయంగా వ్యవహరించాలని సూచించారు. దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా శాసనసభ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఆయన, సభా చర్చల్లో భాషా వినియోగం విషయంలో కూడా సభ్యులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నైతిక ప్రమాణాల అమలు, శాసన వ్యవస్థ గౌరవం, ప్రజల విశ్వాస పరిరక్షణ దిశగా ఎథిక్స్ కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రివిలేజ్ కమిటీ సభ్యుల హక్కుల గురించి ఏ రకంగా కృషి చేస్తుందో అలాగే ఎథిక్స్ కమిటీ సభ్యుల విలువలను ప్రతిబించేలా పని చేసేందుకు ఎథిక్స్ కమిటీ కృషి చేస్తుందని అన్నారు..చట్ట సభలో ఉండే సభ్యుల పనితీరును ప్రజలు లోతుగా గమనిస్తారని మనం హుందాగా విలువలను కాపాడుకుంటూ పని చేయాలని సూచించారు.

# భారత్‌లోకి జర్మన్ డోనర్ కబాబ్ ఎంట్రీ

- హైదరాబాద్‌లో తొలి ఔట్‌లెట్ ప్రారంభం..
- ఔట్‌లెట్ ను ప్రారంభించిన మంత్రి



**హైదరాబాద్: ఆగస్టు 18 ( భవిష్యత్ ప్రజాపాలన):** ప్రపంచ ప్రఖ్యాత ప్రీమియం క్విక్ సర్వీస్ రెస్టారెంట్ బ్రాండ్ జర్మన్ డోనర్ కబాబ్ భారత్‌లోకి ప్రవేశించింది. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని టాలీవుడ్ లేన్, జూబ్లీహిల్స్‌లో దేశంలోనే తొలి ఔట్‌లెట్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. భారత్‌లో మాస్టర్ ఫ్రాంచైజీ భాగస్వామిగా వ్యవహరిస్తున్న జీబీసీ ఇండియా ఆధ్వర్యంలో ఈ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జర్మన్ డోనర్ కబాబ్ ఇండియా సీఈఓ విక్రాంత్ తోమర్ మాట్లాడుతూ..హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని దేశవ్యాప్తంగా దీర్ఘకాలంలో 450కి పైగా రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సొంత ఔట్‌లెట్లతో పాటు ఫ్రాంచైజీ విధానంలోనూ విస్తరణ చేపట్టనున్నట్లు చెప్పారు.భారత్‌లో కేవలం రెస్టారెంట్ చైన్‌ను ఏర్పాటు చేయడం కాకుండా, డోనర్ ఫుడ్ కేటగిరీని మరింత అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, తాజా పదార్థాలు, నాణ్యమైన ఉత్పత్తులతో భారతీయ వినియోగదారులకు ప్రత్యేకమైన డోనర్ అనుభవాన్ని అందిస్తామన్నారు. అనంతరం జీబీసీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గిన్నీ సాహ్నీ మాట్లాడుతూ.. జర్మన్ డోనర్ కబాబ్‌తో తమ భాగస్వామ్యం దశాబ్దానికి పైగా కొనసాగుతోందని తెలిపారు. హైదరాబాద్ అనంతరం మొహాలి, చండీగఢ్‌తో పాటు ఇతర టియర్-1, టియర్-2 నగరాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు.బెర్లిన్‌లో స్థాపించబడిన ఈ బ్రాండ్ ప్రస్తుతం యూకే, అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, కెనడా, స్వీడన్, ఐర్లాండ్ తదితర దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఫ్లేమ్-గ్రిల్డ్ డోనర్, తాజా పదార్థాలు, ప్రత్యేక సాస్‌లు, టోస్ట్ చేసిన వాఫిల్ బ్రెడ్ ఈ బ్రాండ్ ప్రత్యేకతలుగా సంస్థ తెలిపింది.యువతను ఆకట్టుకునేలా సంగీతం, ఫ్యాషన్, క్రీడలు, ఫిట్‌నెస్, వినోదం వంటి రంగాలతో బ్రాండ్‌ను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ సంగీత కళాకారుడు, నటుడు, దర్శకుడు పర్మిష్ వర్మను సాంస్కృతిక భాగస్వామిగా నియమించినట్లు వెల్లడించింది.

# ఇప్పుడు తెలంగాణ-ఆంధ్రలో పాపన్న స్ఫూర్తి రగులుతోంది

- సర్వాయి దారిలో నూతన రాజకీయ శక్తులు

**జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ**



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 18:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ స్ఫూర్తితో నూతన రాజకీయ శక్తులు ప్రజా స్వరాజ్యం, సామాజిక సమానత్వం, గ్రామ స్వయంపాలన లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయని జై స్వరాజ్ పార్టీ అధినేత శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ చౌరస్తాలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి వేడుకల్లో జై స్వరాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాపన్న మహారాజ్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాసాని శ్రీనివాసరావు గౌడ మాట్లాడుతూ, సర్వాయి పాపన్న మహారాజ్ కేవలం ఒక చారిత్రక వ్యక్తి మాత్రమే కాదని, సామాన్య ప్రజలకు రాజ్యాధికారం అందించాలనే సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలను ఏకం చేసి, ప్రజల కోసం పోరాడిన పాపన్న మహారాజ్ స్ఫూర్తి నేటి తరానికి కూడా ఎంతో అవసరమన్నారు. “మన రాజ్యం మనం ఏలుదాం” అనే భావనలోనే పాపన్న మహారాజ్ పోరాట స్ఫూర్తి దాగి ఉందని ఆయన అన్నారు. ప్రజలు తమ గ్రామాలు, తమ వనరులు, తమ అభివృద్ధిపై తామే నిర్ణయాలు తీసుకునే విధంగా గ్రామ స్వరాజ్యం బలపడాల్సిన అవసరం ఉందన్నారు. నేటి రాజకీయ వ్యవస్థలో సాధారణ ప్రజలు నిర్ణయాధికారానికి దూరమవుతున్నారని, రాజకీయాలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి, ప్రతి యువకుడికి, ప్రతి మహిళకు పాలనలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు. పాపన్న మహారాజ్ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, స్వయంపాలన, సామాజిక న్యాయం వంటి విలువలను నేటి రాజకీయాల్లో ఆచరణలోకి తీసుకురావడమే నిజమైన నివాళి అని ఆయన అన్నారు. తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనూ పాపన్న స్ఫూర్తితో ప్రజా ఆధారిత నూతన రాజకీయ ఆలోచనలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. జై స్వరాజ్ పార్టీ లక్ష్యం అధికారాన్ని కేవలం ఒక రాజకీయ వర్గానికి పరిమితం చేయడం కాదని, ప్రజలే పాలకులుగా, గ్రామాలే అభివృద్ధికి కేంద్రాలుగా ఉండే స్వరాజ్య వ్యవస్థను నిర్మించడం అని ఆయన స్పష్టం చేశారు. “సర్వాయి పాపన్న మహారాజ్ స్ఫూర్తితో నేటి యువత ముందుకు రావాలి. రాజకీయాల్లో మార్పు కోసం ఎదురుచూడకుండా, మార్పులో తామే భాగస్వాములు కావాలి. గ్రామ స్వరాజ్యంతోనే ప్రజా స్వరాజ్యానికి బలమైన పునాది ఏర్పడుతుంది” అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు. ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జనగాం వెంకటేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, జై గౌడ్ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ , బొంగు వెంకటేష్ గౌడ్, బెల్లంకొండ నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.పాపన్న మహారాజ్ జయంతి సందర్భంగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాపన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామ స్వరాజ్యం, ప్రజా భాగస్వామ్యం, సామాజిక న్యాయం, స్వయంపాలన కోసం మరింత విస్తృతంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# ర్యాగింగ్, డ్రగ్స్‌కు చెక్

## దేవరకొండ గిరిజన మహిళా కళాశాలలో అవగాహన

- **నో టు ర్యాగింగ్, నో టు డ్రగ్స్ విద్యార్థినులకు CI వెంకట్ రెడ్డి సందేశం సురక్షిత క్యాంపస్ కోసం**



**కళాశాలలో ప్రత్యేక కౌన్సెలింగ్**

- **యువతను డ్రగ్స్ నుంచి కాపాడుదాం - విద్యార్థినులతో ప్రతిజ్ఞ ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు- CI హెచ్చరిక**



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్డు:** దేవరకొండ/తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, దేవరకొండలో Anti Ragging & Anti Drug వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 12 నుంచి 18 వరకు జరుగుతున్న ఈ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి దేవరకొండ CI వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా CI వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, కఠినమైన చట్టపరమైన చర్యల గురించి వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ కెరీర్ దెబ్బతింటుందని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులు, కళాశాల యాజమాన్యానికి తెలియజేయాలని సూచించారు. అలాగే డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్యం, చదువు, కుటుంబంపై పడే ప్రభావాలను ఉదాహరణలతో వివరించారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించి, ధైర్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యార్థి జీవితమే ఉన్నతికి మార్గమని అన్నారు. క్యాంపస్‌లో ర్యాగింగ్ రహిత వాతావరణం కోసం కళాశాల ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమం చివరలో Anti Drug ప్రతిజ్ఞను అందరూ చేతులెత్తి చేశారు. ఈ కార్యక్రమంలో Anti Ragging కమిటీ సభ్యులు వి. శ్రీలత, G. మహేశ్వరి (PD), ఇ. భాగ్యమ్మ, అధ్యాపక బృందం, రక్షక సిబ్బంది మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్తకు స్పందన.. తీగల వాగుకు మరమ్మతులు

- **ఆగస్టు 12న భవిష్యత్ ప్రజాపాలనలో కథనం.. నాలుగు రోజుల్లోనే అధికారుల స్పందన**
- **ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్ వెలుగులోకి తెచ్చిన ప్రజా సమస్యకు పరిష్కార చర్యలు**
- **ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా భవిష్యత్ ప్రజాపాలన**




**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్ ఆగస్టు 16 చేవెళ్ల నియోజకవర్గం, రంగారెడ్డి జిల్లా:** ఆగస్టు 12న భవిష్యత్ ప్రజాపాలన పత్రికలో ప్రచురించిన వార్తకు నేడు ఫలితం కనిపించింది. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తీగల వాగు వంతెన వద్ద రహదారి దుస్థితి, గుంతల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదకర పరిస్థితులపై ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్ కథనం ద్వారా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చారు. వార్త ప్రచురితమైన నాలుగు రోజులకే అధికారులు స్పందించి తీగల వాగు వంతెన వద్ద రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిపై మట్టి వేసి దెబ్బతిన్న ప్రాంతాన్ని సరిచేసే పనులు ప్రారంభించడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని భవిష్యత్ ప్రజాపాలన ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి మార్గం సుగమం చేయడమే తమ లక్ష్యమని పత్రిక ప్రతినిధి పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సంబంధిత అధికారుల దృష్టికి చేర్చడం ద్వారా భవిష్యత్ ప్రజాపాలన పత్రిక ప్రజలకు, పాలనకు మధ్య వారధిగా నిలుస్తోంది. అయితే రాత్రి వేళల్లో మట్టి వేసిన ప్రాంతంలో రహదారి వంపు ఎక్కువగా ఉండటంతో వాహనదారులకు అది సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం చేపట్టిన మరమ్మతులను పూర్తిస్థాయిలో పూర్తి చేసి రహదారిని సురక్షితంగా మార్చాలని వారు కోరుతున్నారు. ఆగస్టు 12న భవిష్యత్ ప్రజాపాలనలో వచ్చిన కథనానికి ఆగస్టు 16న మరమ్మతుల రూపంలో స్పందన రావడం ద్వారా ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకెళ్లే పత్రికా కృషికి ఫలితం లభించినట్లయింది.

## గుండాల ఉప సర్పంచ్ కొమ్ము లింగం మృతికి

# గోలి శ్రీనివాస్ రెడ్డి సంతాపం



●కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం.. అండగా ఉంటామని భరోసా

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** గుండాల గ్రామ ఉప సర్పంచ్ కొమ్ము లింగం అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లింగం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా "కష్టకాలంలో కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టకుండా అండగా నిలవడమే మానవత్వానికి నిజమైన నిర్వచనం. కొమ్ము లింగం కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది" అని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. లింగం కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. గుండాల గ్రామ ఉప సర్పంచ్‌గా కొమ్ము లింగం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి గ్రామానికి, పార్టీ శ్రేణులకు తీరని లోటని పేర్కొన్నారు. లింగం ఆత్మకు శాంతి చేకూరాలని,ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జోగయ్య, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, మాజీ జడ్పీటీసీ జంగయ్య, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మాజీ ఎంపీటీసీ లింగం, 4వ వార్డు సభ్యులు సునీత ఆనంద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగయ్య, నాయకులు దాసు, గుండాల శ్రీను, సత్యం, ప్రవీణ్, వెంకటయ్య, రవి, తిరుపతి, జగన్, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ

### జిల్లా అధ్యక్షుల ఎన్నికలపై ఎగ్జిక్యూటివ్ సమావేశం



**హైదరాబాద్ :** గాంధీభవన్‌లో ఈరోజు ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు, జిల్లా అధ్యక్షుల ఎన్నికలపై ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ శ్రీ కేతావత్ శంకర్ నాయక్ గారి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రాజజ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు గౌరవ అతిథిగా హాజరై, పార్టీ సంస్థాగత బలోపేతం మరియు ఆదివాసీ కాంగ్రెస్ కార్యవర్గ ఎన్నికలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు పలువురు ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.

## జాతీయ సదస్సుకు గవర్నర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్, ఆగస్టు 18 (భవిష్యత్ ప్రజాపాలన ):** హైదరాబాద్ వేదికగా ఈ నెల 21న జరగనున్న ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందుకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం లోకభవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేసింది. రెండు రోజులపాటు జరిగేసదస్సులో జాతీయస్థాయిలో మీడియా ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల పనితీరు తదితర అంశాలపై గవర్నర్ సందేశం ఇవ్వనున్నారు. దేశవ్యాప్తంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీని అందజేసి, పూల మొక్కతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యుడు ఎన్. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొరియన్ టెక్నాలజీతో చర్మ, కేశ సంరక్షణ



●భారతీయులకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే మా లక్ష్యం

**వికే కొరియన్ డెర్మా క్లినిక్ వ్యవస్థాపకులు కార్తీక్**

**ఖైరతాబాద్ ;ఆగస్టు 18 (భవిష్యత్ ప్రజాపాలన):** కొరియన్ సౌందర్య సంరక్షణ విధానాలు, ఆధునిక సాంకేతికతతో చర్మ, కేశ సంబంధిత సమస్యలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వీకే కొరియన్ డెర్మా క్లినిక్ అందుబాటులోకి తెస్తున్నట్లు వికే కొరియన్ డెర్మా క్లినిక్ వ్యవస్థాపకులు కార్తీక్ తెలిపారు. ఈ మేరకు జె ఎన్ టి యు మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన తమ క్లినిక్ ను బుధవారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంగళ వారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వైద్యులు ప్రణయ్ రెడ్డి, క్లినిక్ సిబ్బందితో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కొరియన్–ప్రేరిత సాంకేతికత, ఆధునిక చికిత్సా విధానాలతో పాటు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించడం క్లినిక్ ప్రత్యేకతగా తెలిపారు. చర్మవ్యాధి నిపుణులు, డెర్మటోసర్జన్ల పర్యవేక్షణలో పిగ్మెంటేషన్, మొటిమలు, మొటిమల మచ్చలు, సన్ డ్యామేజ్, యాంటీ ఏజింగ్, హెయిర్‌ఫాల్, డాండ్రఫ్ తదితర సమస్యలకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఆధునిక లేజర్, హెయిర్ కేర్, డెర్మటాలజీ సేవలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భారతీయుల చర్మ, కేశ అవసరాలకు అనుగుణంగా కొరియన్–ప్రేరిత సాంకేతికతను వినియోగిస్తూ నాణ్యమైన చికిత్స అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## ఆత్మగౌరవ పోరాట యోధుడు

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



●గుండాల ఆగస్టు 18 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన

తెలంగాణ విప్లవ వీరుడు, బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గుండాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ధైర్య సాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని పలువురు కొనియాడారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన పాపన్న గౌడ్ చరిత్రను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఆయన సేవలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సుధగాని రామచంద్రయ్య, పొడిచెట్టి వెంకన్న, కొమ్మాయిపల్లి బాలరాజ్, ఏలికట్టి సోమయ్య, గిరకత్తుల శ్రీనివాస్, బుసిగంప పరశురాములు, అంబటి సోమయ్య, దంతూరి మల్లయ్య, ఒలంధాస్ ప్రభాకర్, చంద్రగిరి వెంకన్న, గంగాపురం ఉప సర్పంచ్ ఎలికట్టి మల్లయ్య, ఏలికట్టి చిన్న మల్లయ్య, చంద్రగిరి అంజయ్య, ఎలికట్టి ముత్తయ్య, గుండాల ఉప సర్పంచ్ ఆవుల సాయిప్రసాద్, గుండాల గ్రామ శాఖ అధ్యక్షుడు కొడపర్తి భాస్కర్, సింగిల్ విండో డైరెక్టర్ దూదిగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో విషాద స్మరణ..

# కన్నీటి నివాళులు



●గుడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రథమ వర్ధంతి కార్యక్రమం

**ఉప్పల్,ఆగష్టు18(భవిష్యత్ ప్రజాపాలన):** రామంతాపూర్ మెయిన్ రోడ్‌లోని ఆల్ఫా హోటల్ దగ్గర గుడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గత సంవత్సరం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వారికి ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రఫీక్ మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కీ.శే. రాజేంద్ర రెడ్డి, కీ.శే. కాటేపల్లి శ్రీకాంత్ రెడ్డి, కీ.శే. రుద్ర వికాస్, కీ.శే. చెట్టబోయిన సురేష్ యాదవ్ (రామంతాపూర్ యాదవ సంఘం యూత్ అధ్యక్షులు), కీ.శే. పింజర్ల క్రిష్ణ యాదవ్ (డైమండ్ యాదవ్) యొక్క ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీక్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భోజనాన్ని వడ్డించారు.

**మరిచిపోలేని జ్ఞాపకాలు.. చెరిగిపోని అనుబంధాలు..**

వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, వల్లపు శ్రీకాంత్ యాదవ్,పూస సత్తయ్య,గంగపుత్ర భాస్కర్, ఆదినారాయణ గౌడ్, స్వామి,ఎం డి నయీమ్,బుల్లెట్ అశోక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం

# పోరాడిన ధీరుడు పాపన్న గౌడ్



●ఆయన పోరాట స్ఫూర్తి బహుజనులకు ఆదర్శం: దేప భాస్కర్ రెడ్డి

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన గొప్ప బహుజన వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి అన్నారు. పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ బోట్స్ క్లబ్ సమీపంలోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాల్లో దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కార్యక్రమంలో పాల్గొని మహనీయుడికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమానత్వం, హక్కులు దక్కాలనే లక్ష్యంతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తన జీవితాన్ని పోరాటానికి అంకితం చేశారని కొనియాడారు. నాటి సామాజిక పరిస్థితుల్లో ఆధిపత్య శక్తులకు ఎదురొడ్డి నిలిచిన ఆయన ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. "కొడితే గోల్కొండ కోటనే కొట్టాలె" అనే పాపన్న గౌడ్ ఆశయం ఆయనలోని ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని భాస్కర్ రెడ్డి అన్నారు. బహుజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పాపన్న గౌడ్ చరిత్రను పాఠ్యాంశాల్లో మరింత విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు, ఆయన పోరాట స్ఫూర్తిని యువతకు తెలియజేయాలని అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లేంకి ధన్ రాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పందుల వెంకటేష్ గౌడ్, కాందాటి జంగారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణపై

# శాతపూర్‌లో ప్రజాబాట



**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు18 పాలకుర్తి:** విద్యుత్ ప్రమాదాల నివారణ, ప్రజల్లో విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో శాతపూరం గ్రామంలో మంగళవారం ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల శాతపూర్ గ్రామంలో రాగిరు అనిత ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషాద ఘటన నేపథ్యంలో, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామంలోని ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప తీగలను తొలగించి, వాటి స్థానంలో విద్యుత్ శాఖ సిబ్బంది స్వంత ఖర్చులతో ఇన్సులేటెడ్ జి ఐ వైర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వినియోగదారులకు విద్యుత్ తీగలు, సర్వీస్ వైర్లు, విద్యుత్ పరికరాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణ, అనధికారిక విద్యుత్ కనెక్షన్ల వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా జనగామ జిల్లా విద్యుత్ శాఖ నోడల్ అధికారి శ్రీ పి. శ్రీకాంత్ ఆధ్వర్యంలో తొర్రూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై పిపిటి ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తూ, విద్యుత్ పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రమాదకర పరిస్థితులను గుర్తించి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పి. శ్రీకాంత్, జనగామ జిల్లా విద్యుత్ శాఖ నోడల్ అధికారి/ఎస్ ఈ , శ్రీ పి. సంపత్ రెడ్డి, జనగామ జిల్లా రాజు గారు, శ్రీ సారయ్య, డి ఈ ఘనపూర్, శ్రీ బి. శ్రీధర్, ఏడిఈ పాలకుర్తి, సబ్ ఇంజనీర్లు, ఏఏఓ మరియు విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు గ్రామ సర్పంచ్ శ్రీ లోనే శ్రీనివాస్ మరియు వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షులు చిన్న యాదయ్య పాల్గొన్నారు.

"విద్యుత్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత – అప్రమత్తతతోనే ప్రాణ రక్షణ." అని పేర్కొన్నారు

## ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం

# ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పునఃప్రారంభం

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18:** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల్లో 2026–27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తిరిగి ప్రారంభించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన పలు అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు మరో అవకాశం కల్పించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. నీట్ యూజీ–2026లో నిర్ణీత కటాఫ్ స్కోర్ లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి అర్హత పొందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ ఆగస్టు 18, 2026 మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆగస్టు 20, 2026 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఇప్పటికే తమ దరఖాస్తులను సమర్పించిన అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని యూనివర్సిటీ స్పష్టం చేసింది. అభ్యర్థులు ఇతర వివరాల కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్‌ను పరిశీలించావెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ గడువు: ఆగస్టు 18, 2026 మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆగస్టు 20, 2026 సాయంత్రం 6 గంటల వరకు.

# నడక-యోగ ఏది మంచిది?

వ్యాయామం అనగానే ఠక్కున గుర్తుకొచ్చేవి.. వాకింగ్, యోగ! పిల్లలు మొదలుకొని పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ చేయగలుగుతారు. అయితే, ఈ రెండిటిలో ఏది మన ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుంది? ఎలాంటి సమస్యలు ఉన్నవారు ఏది ఎంచుకోవాలి? అనే ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇస్తున్నారు. మార్నింగ్ వాక్, యోగ.. రెండూ ఆరోగ్యానికి మేలు చేసేవే! అయితే, ఈ రెండిటి వల్ల కలిగే ప్రయోజనాలు, శరీరంపై చూపించే ప్రభావాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి, మీ శరీర అవసరాలు, ఆరోగ్యం, ఆశయాలను బట్టి ఏది ఎంచుకోవాలో నిర్ణయించుకోవచ్చు.

**మార్నింగ్ వాక్:** ఇది అద్భుతమైన కార్డియో వ్యాయామం. శరీరాన్ని చురుగ్గా ఉంచడానికి.. నడక అనేది చాలా తేలికైన, ప్రభావవంతమైన మార్గం కూడా. మార్నింగ్ వాక్ వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కేలరీలు వేగంగా కరిగిపోతాయి.

# పేదల ఇళ్ల నిర్మాణానికి పారిశ్రామిక తోడ్పాటు

●ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా
●పరిశ్రమల సామాజిక బాధ్యతకు మంత్రి పొంగులేటి ప్రశంసలు!

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా (హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశాం. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం చుట్టాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. మంత్రిగారి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను 230 రూపాయిలకు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.





# అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో

## కళ్యాణలక్ష్మీ-షాదీ ముబారక్ పథకాల పరిరక్షణకు మహా ధర్నా







**అచ్చంపేట: భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్టు జలగం సురేందర్:** ఈరోజు అచ్చంపేటలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మీ-షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా మహా ధర్నా నిర్వహించారు. ఈ పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవో గారికి వినతిపత్రం అందజేశారు. అచ్చంపేట, బల్మూర్‌తో పాటు పరిసర మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని ధర్నాను విజయవంతం చేశారు. కళ్యాణలక్ష్మీ-షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి పేద కుటుంబాలకు న్యాయం చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ భీమా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోకల మనోహర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహ గౌడ్, మాజీ చైర్మన్ తులసీరాం, మైనార్టీ నాయకులు అమీనుద్దీన్, బల్మూర్ మండల మాజీ ఎంపీపీ కర్నాకర్ రావు హాజరయ్యారు. వీరితో పాటు అచ్చంపేట టౌన్ మరియు పరిసర మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో కమిటీ సభ్యుల అత్యున్నత స్థాయి భేటీ..

●ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (G.O.Rt.No.679) చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు (కేకే) నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో రవాణా ఒ బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీ మోతె శోభన్ రెడ్డి, మరియు మాజీ ఎమ్మెల్సీ శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన "చర్చలపై ఒక ముసాయిదా నోట్" పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు.

**ఉద్యమకారుల వర్గీకరణ (కేటగిరీల విభజన) ముసాయిదా పరిశీలన:**
సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను క్రింది గ్రూపులుగా గుర్తించే విధానాన్నికమిటీ ప్రాథమికంగా పరిశీలించింది:

**మొదటి కేటగిరీ (అమరుల కుటుంబాలు):** ఉద్యమ క్రమంలో అమరులైన వారు (సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది). మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం.

రెండవ కేటగిరీ (గాయపడిన ఉద్యమకారులు): పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు మరియు ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు. మూడవ కేటగిరీ జైలు జీవితం గడిపిన వారు: తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలుశిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమ కారులు.నాల్గవ కేటగిరీ కేసులు నమోదైన వారునాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిల్ బుల్ నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు.

**ప్రత్యేక కేటగిరీలు సంస్థాగత ఒ క్రియాశీలక శ్రేణులు):** కేసులు నమోదు కానప్పటికీ.. ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్-ధామ్ కళాకారులు వివిధ సంస్థల సభ్యులు.

**ఉద్యమకారుల ఆకాంక్షలు సంక్షేమ అభ్యర్థనలు:**

**సత్కారం - సహాయం - సహకారం:** ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది.

**గుర్తింపు కార్డులు ప్రదానం:** ఉద్యోగులు వసతి కలిగిన వారు కేవలం 'గుర్తింపు కార్డు ప్రశంసా పత్రం' ఆశిస్తుండగా.. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు.

**చట్టబద్ధత & కార్పొరేషన్:** జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**కమిటీ తక్షణ కార్యాచరణ నిర్ణయాలు:**

**సమీక్ష అనంతరం చైర్మన్ కేకే కమిటీ సభ్యులు తదుపరి చేపట్టవలసిన చర్యలను ఖరారు చేశారు:**
త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ పోర్టల్ ద్వారా ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడం. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం. శాసనసభ్యులు శాసనమండలి సభ్యులతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కి సమర్పించడం. మీడియా సెల్, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ.

# పచ్చని పైరులు, రంగుల సందడి

## నియోజకవర్గంలో తీజ్ ఉత్సవాలు





●చిన్నా పెద్దా ఒక్కటైన తీజ్ - ట్రెడిషనల్ లుక్ తో కళకళలాడిన తండాలు
●9 రోజుల భక్తి సందడి - నల్లగొండ జిల్లాలో బంజారా తీజ్ సంబరాలు

**నల్లగొండ జిల్లా దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వర్ధ :** బంజారా సంస్కృతికి ప్రతీక అయిన తీజ్ పండుగ నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని పలు తండాల్లో ఘనంగా జరిగింది. 9 రోజుల పాటు పెళ్ళికాని ఆడపడుచులు నిష్ఠతో ఆచరించే ఈ పండుగలో తండాలన్నీ పండుగ వాతావరణంతో నిండిపోయాయి. తీజ్ సందర్భంగా ఆడపడుచులు గోధుమలు, బార్లీ విత్తనాలను బుట్టలు, మట్టి కుండల్లో నాటి రోజూ పూజలు చేశారు. చివరి రోజు బుట్టలపై పచ్చని పైరు బుట్టలు పెట్టుకుని, సంప్రదాయ పాటలు పాడుతూ ఊరేగింపు వెళ్లారు.

**ప్రత్యేకంగా చిన్నారులు ఆకర్షణీయంగా కనిపించారు**
ఈ పండుగలో చిన్నారులు పెద్దలు తమ ప్రత్యేక ట్రెడిషనల్ లుక్ తో అందరినీ ఆకట్టుకున్నారు. మహిళలు రంగురంగుల లంగా-ఓని నగలు, పూలతో అలంకరించుకోగా, పురుషులు ఎర్రటి పాగాలు, కుర్తా-ధోతీ, రంగు బ్యాండ్లతో సంప్రదాయాన్ని చాటారు. చిన్నారులు కూడా పెద్దలను చూసి అదే తరహాలో దుస్తులు ధరించి పండుగలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తండాల్లో డప్పు చప్పుళ్లకు అనుగుణంగా యువతీ యువకులు, మహిళలు సామూహిక నృత్యాలు చేశారు. గ్రీన్ అంబ్రెల్లా వత్తుకని నాయకులు, ప్రజలు కలిసి డ్యాన్స్ చేసిన దృశ్యాలు అందరినీ ఆకర్షించాయి. తండా పెద్దలు మాట్లాడుతూ తీజ్ పండుగ ఆడపడుచులకు మంచి జీవిత భాగస్వామి రావాలని, గ్రామంలో సుభిక్షత, పంటలు బాగా పండాలని కోరుకుంటూ చేసే పవిత్ర వ్రతమని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని పలు తండాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు.



# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ






●క్లీన్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
●పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలకు పూర్తిహృదయంతో ఆత్మీయ ఆహ్వానం
●2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యమే లక్ష్యం
●హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ఒ ఎక్స్ పో 2026'ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18:** తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ & ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. "పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవడానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్తిహృదయంతో ఆహ్వానిస్తున్నాను. ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది" అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, AI నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే AI డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇవిచార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టీజీ ఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.



# రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలల సమాచారం కోరుతూ ఆర్‌టీఐ దరఖాస్తు



**హైదరాబాద్:** Rangareddy జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, సదుపాయాలు మరియు నియమ నిబంధనల అమలుపై ఆర్‌టీఐ (RTI) హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ దృష్టి సారించింది. సమాచార హక్కు చట్టం-2005 కింద పాఠశాలల సమగ్ర వివరాలు వెల్లడించాలని కోరుతూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. సాయిప్రసాద్ రావు నేతృత్వంలో జిల్లా విద్యాధికారి (DEO) కార్యాలయానికి దరఖాస్తు సమర్పించార పాఠశాలల అధికారిక గుర్తింపు సంఖ్యలు, అనుమతి తేదీలు మరియు 2025--2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన రీల్యూవల్ స్టేటస్. ఉపాధ్యాయుల అర్హతలు & నిష్పత్తి బోధనా సిబ్బంది విద్యా అర్హతలతో పాటు, ఆర్‌టీఈ నిబంధనల ప్రకారం 1:30 ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి పాటిస్తున్నారా లేదా అనే సమాచారం. ఆర్‌టీఈ ఉచిత విద్య & రీయింబర్స్‌మెంట్ 25% ఉచిత కోటా కింద 2022 నుండి 2025 వరకు ప్రైవేట్ పాఠశాలల్లో పొందిన ప్రవేశాలు మరియు వాటికి చెల్లించిన రీయింబర్స్‌మెంట్ నిధుల వివరాలు. పాఠశాల మౌలిక వసతులు: తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఆటమైదానాలు, పాఠ్యపుస్తకాలు మరియు యూనిఫాంల పంపిణీ సమాచారం.

**భద్రతా ప్రమాణాలు:** పాఠశాల భవనాల ఫిట్‌నెస్ నివేదికలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు, స్కూల్ బస్సుల రవాణా భద్రత, డ్రైవర్ల లైసెన్సులు మరియు ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు.

**ఫీజుల పారదర్శకత & మానసిక ఒత్తిడి నివారణ:** 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి తరగతుల వారీగా వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు, అలాగే టీచర్ల మానసిక ఒత్తిడి తగ్గించేందుకు చేపట్టిన ప్రోగ్రామ్‌ల వివరాలు. విద్యార్థుల భవిష్యత్తు మరియు భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ సమగ్ర వివరాలను త్వరలోనే విద్యాశాఖ వెల్లడించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి
- ఆశలపై కాదు... అందుబాటులోని జలాల ఆధారంగానే విడుదల నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు - ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం
- సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18:** ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున "తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ" అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. "మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమగ్రంగా సమీక్షించారు. సింగూరు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్యామ్‌కు అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయాలని, తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో ఇంజినీర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం భారత వాతావరణ శాఖ తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాలం చెల్లిన సమాచారంపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను తాజా పరిస్థితులకు అనుగుణంగా నవీకరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే అవకాశం ఉన్న ముంపు ప్రభావంపై అధ్యయనం చేస్తున్న ఐఐటీ నిపుణులతో త్వరితగతిన తదుపరి సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ భూభాగంలో ఎంతమేర వరద ప్రభావం లేదా ముంపు ఏర్పడే అవకాశం ఉందన్న అంశంపై శాస్త్రీయమైన, తిరుగులేని సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన రక్షణ చర్యలను కేంద్రం నుంచి కోరేందుకు ఈ అధ్యయనం తెలంగాణకు బలమైన ఆధారంగా నిలవాలని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై కూడా మంత్రి విస్తృతంగా సమీక్షించారు. ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణలు, సుప్రీంకోర్టులోని కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాల అధికారులు సమన్వయంతో సంక్షిప్తమైనా సమగ్రమైన నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. "నీరు ప్రకృతి ఇచ్చే సంపద మాత్రమే కాదు... ప్రజల భవిష్యత్తుకు ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యత. తాగునీటిని కాపాడాలి... రైతు పంటను నిలబెట్టాలి... రేపటి అవసరాన్ని విస్మరించకుండా నేటి అవసరాన్ని తీర్చాలి. అందుకే ఈ సమయంలో ప్రతి టీఎంసీకి లెక్క ఉండాలి... ప్రతి విడుదలకు శాస్త్రీయ కారణం ఉండాలి... ప్రతి నిర్ణయంలో రైతు ప్రయోజనం, ప్రజల తాగునీటి భద్రత ప్రతిబింబించాలి" అన్న దిశలో అధికారులు పనిచేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఓ అండ్ ఎం, క్వాలిటీ కంట్రోల్) ఆర్. మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అనారోగ్యం, మానసిక వేదనతో వివాహిత ఆత్మహత్య




**భవిష్యత్ ప్రజాపాలన షాబాద్ ఆగస్టు 18 చేవెళ్ల నియోజకవర్గం :** తిమ్మారెడ్డిగూడ గ్రామంలో మద్దూరి మౌనిక (29) అనే వివాహిత మహిళ ఉరివేసుకుని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మౌనికకు సుమారు మూడేళ్ల క్రితం రాజశేఖర్‌తో వివాహం కాగా, 15నెలల వయస్సు గల కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా మౌనిక అనారోగ్యంతో పాటు మానసికంగా కూడా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆగస్టు 17న సాయంత్రం సుమారు 4గంటల సమయంలో మౌనిక బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా, కిటికీకి చున్నీతో ఉరివేసుకుని కనిపిం చింది. వెంటనే ఆమెను కిందకుదించి పరిశీలించగా అప్పటికేమృతి చెందినట్లు గుర్తించారు. అనారోగ్యం, మానసిక సమస్యల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య కు పాల్పడి ఉండవచ్చని మౌనిక తండ్రి చిట్ల సైలూ తెలిపారు. తన కుమార్తె మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి BRS నాయకుల సానుభూతి



- చిన్నమునిగల్‌లో కేతావత్ చిరు కుటుంబానికి 10 వేల ఆర్థిక సహాయం

**దేవరకొండ/ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య :** నేరడుగొమ్ము మండలం చిన్నమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ చిరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని BRS రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ అన్నారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన చిన్నమునిగల్‌లో చిరు మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ, చిరు కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జీవన్ భగత్, కేతావత్ మంజ్యా నాయక్, కేతావత్ డాక్యా, కేతావత్ హరిలాల్ నాయక్, కేతావత్ నాగు నాయక్, సోమా నాయక్, కేతావత్ చంటి, బిచ్చు, బిక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# బల్కంపేట్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

**సికింద్రాబాద్, ఆగస్టు 18 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని సనత్‌నగర్ నియోజకవర్గంలోని బల్కంపేట్‌లో మంగళవారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలియా మధు గౌడ్, దాసరి విజయ్ కుమార్ గౌడ్ తదితరుల నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బల్కంపేట్‌లో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి మర్రి శశిధర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడిన మర్రి శశిధర్ రెడ్డి, బహుజన రక్షకుడిగా, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. పాపన్న గౌడ్ పోరాట పటిమ, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన ఉద్యమం, ఆశయాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను, సమాజం కోసం చేసిన పోరాటాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి--సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు బి. శ్యామ్ సుందర్ గౌడ్, రాష్ట్ర బీజేపీ యువ నాయకులు మర్రి పురూరవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీశైలం గౌడ్, ప్రముఖ నాయకులు నక్క శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి రాజు గౌడ్, కందుకూరి అనిల్ కుమార్ గౌడ్, దశరథ్ గౌడ్, ప్రవీణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.





# తెలకపల్లి మండలంలోని దాసుపల్లి రైతు వేదికలో రైతులకు సమీకృత వ్యవసాయం మరియు పంటల మార్పిడి పై ఆత్మ వారి సౌజన్యంతో అవగాహన కార్యక్రమం

**మండల వ్యవసాయ అధికారి పీ నర్మద**

**తెల్కపల్లి : దాసుపల్లి భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్:** సమీకృత వ్యవసాయం మరియు పంటల మార్పిడి పై ఆత్మ వారి సౌజన్యంతో అవగాహన కార్యక్రమం ఈ కార్యక్రమంలో రైతులకు విత్తనాలు మరియు ఎరువుల వాడకశీపై అవగాహన, మరియు సరైన టైంలో సరైన పద్ధతి ద్వారా నీటిని పంటలకు అందించే విధానంపై, మరియు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితిలో దృశ్య రైతులు పంటల సాగుపై ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మరియు తక్కువ నీటితో సాగయ్యే పంటలు అయినటువంటి చిరుధాన్యాలు అదేవిధంగా మినుములు పెసర్లు, మరియు ఉలవలు వంటి తక్కువ కాలపరిమితి మరియు తక్కువ నీటి వినియోగం ఉన్నటువంటి పంటల సాగుకి వెళ్లవలసిందిగా సూచిస్తూ అదేవిధంగా కూరగాయలు , ఆయిల్ పామ్ వంటి పంటల వైపు కూడా మొగ్గు చూపించాల్సిందిగా రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రస్తుతం పత్తిలో వస్తున్నటువంటి చీడపీడల నివారణకు పాటించవలసిన సూచనలు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.వి.కె పాలెం నుండి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శైల, మండల వ్యవసాయ అధికారి పీ నర్మద రైతులకు సూచనలు చేయడం జరిగింది. వ్యవసాయ విస్తరణ అధికారులు రాధిక, శివకృష్ణ లతో పాటుగా దాసుపల్లి గ్రామ రైతులు వీరారెడ్డి నరసింహారెడ్డి గార్లతో పాటుగా తదితరులు పాల్గొనడం జరిగింది.



# చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి షాబాద్ ఆగస్టు 18 చేవెళ్ల నియోజకవర్గం :** షాబాద్ మండలం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన చాకలి సత్తమ్మ (70) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా గతంలో తన కుమార్తె ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో సత్తమ్మ కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తరచూ ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులతో చెప్పేదని పేర్కొన్నారు. ఆగస్టు 17న రాత్రి మంగలోని గుట్ట చెరువులో దూకేందుకు వెళ్లగా గ్రామస్థులు గమనించి ఆమెను ఇంటికి తీసుకువచ్చారు. అయితే ఆగస్టు 18న తెల్లవారుజామున సత్తమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం అదే చెరువులో ఆమె మృతదేహం కనిపించగా కుటుంబ సభ్యులు సత్తమ్మగా గుర్తించారు. జీవితంపై విరక్తితోనే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు, ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

# రామంతపూర్ మినీ ట్యాంక్ బండ్ పై
## సర్దార్ సర్వాయి పాపన్న 380వ జయంతి వేడుకలు





**పాల్గొన్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యేఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్**

**ఉప్పల్,ఆగష్టు 18(భవిష్యత్ ప్రజాపాలన):** బహుజనుల ఇలవేల్పు, బడుగు బలహీన వర్గాల కోసం, సామాజిక న్యాయం కోసం,నిజాం నవాబు దుశ్చర్యలను ఎండగట్టిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యొక్క విగ్రహాన్ని ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ నేతృత్వంలో రామంతపూర్ పట్టణ ప్రజల సహకారంతో ప్రతిష్టించడం జరిగింది. ఈరోజు జరిగిన 380 జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, రామంతపూర్‌లోని మినీ ట్యాంక్ బండ్ పై శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 380 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు రామంతపూర్ గౌడ సంఘం నాయకులు, అభిమానులు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను సాధించుటకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరడం జరిగింది. వెంకటరెడ్డి నగర్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను వెంకట రెడ్డి నగర్ గౌడ సంఘం నాయకులు పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు కాలనీవాసులు గౌడ సంఘ సోదరులు పాల్గొనడం జరిగింది.

# శంకర్‌పల్లి బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి



**భవిష్యత్ ప్రజాపాలన శంకర్‌పల్లి ఆగస్టు 18 చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి బస్టాండ్ ప్రవేశద్వారం వద్ద కొబ్బరి బొండాల దుకాణం పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఆగస్టు 17న రాత్రి సుమారు 11 గంటల సమయంలో 30 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అక్కడ పడి ఉన్నట్లు గుర్తించారు. మృతుడు నీలిరంగు భద్రతా సిబ్బంది దుస్తులు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన స్థితిలో ఉన్నట్లు గుర్తించగా, నడుము భాగంలో స్వల్ప గాయాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి వివరాలు, ఆచూకీ తెలియకపోవడంతో శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గుర్తింపు నిమిత్తం చేవెళ్ల మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు శంకర్‌పల్లి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# హైదరాబాద్, కూకట్పల్లిలో కొరియన్ ప్రామాణిక తొలి డెర్మా క్లినిక్ ప్రారంభం




**హైదరాబాద్, ఆగస్టు 18(భవిష్యత్ ప్రజాపాలన):** తెలంగాణలో మొదటి కొరియన్ టెక్నాలజీ ఆధారిత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని వికే కొరియన్ డెర్మా హాస్పిటల్ వ్యవస్థాపకులు కార్తీక్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం తమ క్లినిక్ ని ప్రారంభించనున్నామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిధులుగా తెలుగు సినిమా రంగ ప్రముఖులు పాల్గొంటారన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ ప్రణయ్ రెడ్డి తో కలిసి మాట్లాడారు. చర్మం,జుట్టు సమస్యలకు అత్యాధునిక కొరియన్ చికిత్సలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. హైదరాబాద్ తో పాటు బెంగళూరులో సైతం తమ క్లినిక్ ప్రారంభించినట్లు తెలిపారు. చర్మంపై వచ్చే పిగ్మెంటేషన్, మెలాస్మా, స్కిన్ టైటెనింగ్‌తో పాటు వివిధ రకాల చర్మ సంబంధిత సమస్యలకు ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. అదే విధంగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్స్‌తో పాటు జుట్టుకు సంబంధించిన అన్ని రకాల సేవలు కూడా క్లినిక్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కొరియా నుంచి నేరుగా ఉత్పత్తులు,వినియోగ వస్తువులను దిగుమతి చేసుకుంటున్నామని, ఇందుకోసం పలు కొరియన్ కంపెనీలు,తయారీ సంస్థలతో భాగస్వామ్యం చేసుకున్నామని కార్తీక్ తెలిపారు. భారతీయుల చర్మానికి ఈ ఉత్పత్తులు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశంపై సమగ్ర పరీక్షలు నిర్వహించిన తర్వాతే వాటిని వినియోగిస్తున్నామని చెప్పారు. అలాగే ఎఫ్‌డీఏ, సీడీఎస్‌సీవోతో పాటు భారతీయ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అన్ని అనుమతులు పొందిన తర్వాతే ఈ చికిత్సలను అందిస్తున్నామని స్పష్టం చేశారు.

# ఘనంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు



● **పాలకుర్తి సోమేశ్వర ఆలయంలో జన్మదినం సదర్భంగా పూజలు..**

**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు 18పాలకుర్తి:** పాలకుర్తి మండలం రాజీవ్ చౌరస్తాలో ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు కేకు కటింగ్ చేసి, మహా అన్నదాన కార్యక్రమం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఆత్మ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాఘవరావు , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి మదర్ మరియు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..**టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు** టిపిసిసి ఉప అధ్యక్షురాలు, ఝాన్సీ రెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకొని పాలకుర్తి శ్రీ సోమేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి కి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, నిండు నూరేళ్ల ఆయుష్షు ప్రసాదించాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని పాలకుర్తి చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఝాన్సీ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, సామర్థ్యం, ఆరోగ్యం భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, మహిళల అభ్యున్నతికి, రైతులు మరియు సామాన్య ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఝాన్సీ రెడ్డి కి ఈ జన్మదినం మరింత ఆనందాన్ని, విజయాలను అందించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, పార్టీ శ్రేణులు మరియు అభిమానుల సమక్షంలో ఝాన్సీ రెడ్డి జన్మదిన సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.








జన్మదిన శుభాకాంక్షలు !
మీ నాయకత్వం వర్ధిల్లాలి...
మీ ప్రజాసేవ మరింత విస్తరించాలి...
ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో పెద్ద తండ కె సర్పంచ్ బాలోజీ ఉప సర్పంచ్ బానోతు రవీందర్ డైరెక్టర్ బానోతు రమేష్ నంగునూరు సోమేశ్వర్ మెతుకు రాజు గంగాపురం స్వామి జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నారగాని ఎల్లయ్య కునూరు కృష్ణమూర్తి కొడకండ్ల ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్యా శ్రీనివాస్ పెద్ద తండ కె గ్రామ అధ్యక్షులు గుగులోతు లచ్చిరాం వార్డ్ మెంబర్ దస్రు శ్రీను సీనియర్ నాయకులు బానోత్ బాలు లావుడియా రాందాన్ మరియు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**దేవరుప్పుల మండలంలో**

ఝాన్సీరెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం దేవరుప్పుల,:-పీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదినం సందర్భంగా దేవరుప్పుల పీహెచ్‌సీలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రక్తదానం చేశారు.

# 19 నుంచి 21 వరకు అగర్తలలో యూడీఆర్‌టీఐ శిక్షణా కార్యక్రమం



**సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పి. నర్సింగ్ రావు**

**భవిష్యత్తు ప్రజాపాలన / హిమాయత్ నగర్:** పట్టణాభివృద్ధి పరిశోధన, శిక్షణ సంస్థ (యూడీఆర్‌టీఐ) ఆధ్వర్యంలో త్రిపుర రాజధాని అగర్తలలో అగర్తలా మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ నర్సింగ్ రావు ప్యారసాని తెలిపారు. మంగళవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నందికంటి సాయికుమార్ తో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈ నెల19 నుంచి 21 వరకు జరిగే కార్యక్రమంలో ఉద్యోగుల సామర్థ్య నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి వ్యూహాలపై శిక్షణ ఇవ్వనున్నారు. యూడీఆర్‌టీఐ బృందంలో ప్రొఫెసర్ నర్సింగ్ రావుతో పాటు ఇంజనీర్ అజ్మీరా కృష్ణ, పి. సాయి కిరణ్ పాల్గొంటారు. మున్సిపల్ ఆదాయ అభివృద్ధి వ్యవస్థలపై ప్రొఫెసర్ నర్సింగ్ రావు, నీటి సరఫరా-- నిర్వహణ వ్యవస్థలపై ఇంజనీర్ అజ్మీరా కృష్ణ శిక్షణ అందించనున్నారు. 2001లో హైదరాబాద్‌లో స్థాపించబడిన యూడీఆర్‌టీఐ ఇప్పటివరకు దేశంలోని వివిధ పట్టణ స్థానిక సంస్థల్లో సుమారు 75 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

# బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్...



●**గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బబ్బురి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దమడూరులో ఘనంగా 376వ జయంతి వేడుకలు...**

**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు18 దేవరుప్పుల:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెద్దమడూరు గ్రామంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బబ్బురి శ్రీకాంత్ గౌడ్ నేతృత్వంలో గౌడ సంఘం నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు.. బహుజన రాజ్యాధికారం కోసం ఆయన చేసిన వీరోచిత పోరాటాన్ని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పెద్ద గుంటి, చిన్న గుంటి గౌడ సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జన్మదినం సదర్భంగా పాఠశాలకు కలర్ ప్రింటర్ బహుకరణ



**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు28 పాలకుర్తి:** పాలకుర్తి మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పచిక విజయ్ కుమార్ వారి శ్రీమతి పచిక నీలిమ పుట్టినరోజు సందర్భంగా 15,000 రూపాయల విలువ గల కలర్ ప్రింటర్ ను మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఏపీపీసి చైర్ పర్సన్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ సమక్షంలో బహుకరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఎన్. శ్రీనివాస్, ఎస్. విజేందర్, బి.మంజుల, సిఆర్పి కిషన్, ఎమ్మార్సీ సిబ్బంది ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులందరికీ అరటి పళ్ళు అందించడం జరిగింది.. విజయ్ కుమార్ దాతృత్వానికి కార్యక్రమానికి హాజరైన అందరూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# భర్త వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

**భవిష్యత్ ప్రజాపాలన శంకర్‌పల్లి ఆగస్టు 18 చేవెళ్ల నియోజకవర్గం :** భర్త వేధింపులు భరించలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకర్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం షాద్‌నగర్‌కు చెందిన ప్రశాంతి (36)కు 18 ఏళ్ల క్రితం శ్రవణ్ కుమార్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. గత ఆరు నెలలుగా భర్త మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని ప్రశాంతి ప్రశ్నించడంతో ఆమెను వేధించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త వేధింపులు భరించలేక ఆగస్టు 11న శంకర్‌పల్లిలోని భవానీనగర్‌లో ఉన్న తన తల్లి అద్దె ఇంటికి వచ్చి ఒంటరిగా ఉంటోంది. ఆగస్టు 17న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతురాలి భర్త శ్రవణ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# నేడు నటరాజ రామకృష్ణ నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్




**భవిష్యత్తు ప్రజాపాలన / హిమాయత్ నగర్:** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో లోక ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ నటరాజరామకృష్ణ నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ ఈనెల 19 వ తేదీన రవీంద్ర భారతి లోని ప్రధాన మందిరంలో నిర్వహించనున్నట్లు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా. కళాకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదర్గూడా లోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నటరాజ రామకృష్ణ నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ కు సంబంధించిన బ్రోచర్‌ను ఆంధ్ర నాట్యం గురువు డా. కళా కృష్ణ ఫెస్టివల్ చైర్మన్ డిఆర్ విక్రమ్ కుమార్, ఫెస్టివల్ డైరెక్టర్ లోకా చంద్రశేఖర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ విక్రమ్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఫెస్టివల్ కు డా. కళాకృష్ణ నేతృత్వం వహించనున్నారని తెలిపారు. ప్రముఖ ఒడిస్సీ నృత్యకారిణి గురు నటరాజ రామకృష్ణ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు 2026 ప్రదానం చేయనున్నట్లుగా తెలిపారు. అలాగే సాంప్రదాయం కల్చరల్ ట్రస్ట్ డైరెక్టర్
స్వాతి సోమనాథ్ (ఆంధ్రప్రదేశ్)
డాక్టర్ పేరిణి కుమార్ (తెలంగాణ),
కథక్ సంజయ్ జోషి (తెలంగాణ) కూచిపూడి జ్వాలాముఖి పిన్న (తెలంగాణ); ఆంధ్ర నాట్యం గీత హజారే, (మలేషియా), ఆంధ్ర నాట్యం సంజయ్ వడపల్లి (హాంకాంగ్ ), ఆంధ్ర నాట్యం హరిత కనగల (తెలంగాణ),
ఒడిస్సి దేబాశ్రీ పట్నాయక్ (తెలంగాణ), పేరిని సతీష్ (తెలంగాణ)లకు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ నేషనల్ అవార్డ్స్-2026 అందజేయన్నున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో డాక్టర్ కళా కృష్ణ ఆంధ్ర నాట్య ప్రదర్శన, కేరళ చెందిన చిత్ర సుకుమారన్ మోహిని ఘట్టం, సిరాజుద్దీన్ పేరిణి నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఫార్మాసిటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రాజు భాను, తెలంగాణ ఇన్కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ శంకర్ పండీ, వంశీ రాం బిల్డర్స్ సీఎండీ బద్వేలు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండ్ జక్కుల త్రిశూల్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలురాష్ట్రాల నుండిపలువురు నాట్య గురువులు పాలుపంచుకోనున్నట్లు వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలోఎస్ సిడిఎఫ్ఓ నేషనల్ సెక్రెటరీ సాయి వెంకటేష్,మెంబర్ ఒడిస్సా జగపతి జన, డాక్టర్ సజిని వల్లభనేని పాల్గొన్నారు.

# పచ్చదనంతో పులకించిన తండా ఘనంగా తీజ్ సంబరాలు





●బంజారాల సాంస్కృతిక వైభవం: చిన్నారులతో కళకళలాడిన తీజ్ పండుగ
●ప్రకృతిని పూజించిన గిరిజనులు: తలపై గడ్డితో తీజ్ ఉత్సవం
●ఆటపాటలతో మార్మోగిన వద్య తండా: తీజ్ వేడుకల్లో పెద్ద చిన్న తేడా లేకుండా

**దేవరకొండ, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య :** బంజారా సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్ర పండుగ తీజ్ ఉత్సవాలు దేవరకొండ మండలం వద్య తండాలో ఘనంగా జరిగాయి. పెళ్లికాని బాలికలు, చిన్నారులు ఎంతో పవిత్రంగా భావించే ఈ పండుగను గ్రామ ప్రజలు ఆటపాటలు, నృత్యాలతో కలిసి జరుపుకున్నారు. స్థానిక ఉపసర్పంచ్ వద్య రఘు ఆధ్వర్యంలో తండా వాసులు ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులకు సంప్రదాయ పద్ధతిలో తలపాగా ధరింపజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ వద్య రఘు మాట్లాడుతూ, "గిరిజనులు ఎంతో వైభవంగా జరుపుకునే పండుగల్లో తీజ్ ఒకటి. ఇది ప్రకృతి అనుగ్రహానికి, మేఘాలు, వర్షం, పచ్చదనం, పక్షుల రాకకు సంకేతం. సామాజికంగా అందరం కలిసి ఆచారాలను పాటిస్తూ, నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ, స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపే పండుగ ఇది" అని తెలిపారు. తీజ్ పండుగ సందర్భంగా మహిళలు, చిన్నారులు సంప్రదాయ బంజారా దుస్తులు ధరించి, తలపై గడ్డి కుండీలను పెట్టుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు పాటలు పాడుతూ, గోళ్లు పెట్టుకుని డ్యాన్స్ చేయడంతో తండా మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల్లో పెద్దలు, యువకులు, మహిళలు అందరూ పాల్గొని బంజారా సంస్కృతి గొప్పతనాన్ని చాటారు

# 22-A జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా భూములను పరిశీలిస్తాం



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్,భవిష్యత్ ప్రజాపాలన,సీనియర్ జర్నలిస్ట్ వినోద్ కుమార్:** 22-A జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా భూములను పరిశీలిస్తాం.

**ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు:** జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, 22-A జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు మరియు చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22-A జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22-ఏ జాబితాకు సంబంధించిన అంశాలు, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, భూ రికార్డుల సవరణ ప్రక్రియ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.

అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ 22-A జాబితాలో నమోదైన భూములకు సంబంధించి కొన్ని సందర్భాల్లో పాత సర్వే నంబర్లు, కొత్త సర్వే నంబర్లకు జరిగిన మార్పులు, సరిహద్దులు, భూముల విభజన తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. పాత సర్వే నంబర్ల ఆధారంగా ఉన్న భూములు, అనంతరం వచ్చిన సర్వే నంబర్లలో మిగిలిపోయిన భూములు, సరిహద్దుల ఆధారంగా స్పష్టత అవసరమైన అంశాలను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే హైకోర్టు, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల తీర్పుల ఆధారంగా సంబంధిత భూములకు వర్తించే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. భూ రికార్డులకు సంబంధించి పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు,



పాత సర్వే నంబర్లు, సర్వే రికార్డులు, ఇతర సంబంధిత ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. కేవలం ఒక రికార్డును ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా, సంబంధిత అన్ని రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ULC భూములపై ప్రత్యేక పరిశీలన**

పట్టణ ప్రాంతాల్లో గతంలో Urban Land Ceiling (ULC)కు సంబంధించిన భూములు కూడా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ముఖ్యంగా GO 765 వంటి ఉత్తర్వుల ఆధారంగా గతంలో జరిగిన చర్యలు, డిప్రెషన్/విముక్తి తదితర అంశాలను పరిశీలించి, అర్హత ఉన్న భూముల విషయంలో నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో భూ రికార్డులను సవరించుకోని వారు లేదా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయని వారు నిబంధనల ప్రకారం సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి తమ భూ రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

**HMDA పరిధిలోని భూములపైనా పరిశీలన**

HMDA పరిధిలోని భూములకు సంబంధించి కూడా రికార్డులను పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వానికి చెందిన భూములు, ప్రభుత్వ ఆస్తులు మరియు చట్టపరంగా 22-A పరిధిలోకి వచ్చే భూములను మాత్రమే సంబంధిత నిబంధనల ప్రకారం గుర్తించి జాబితాలో ఉంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "జెన్యూన్ పట్టా భూమి ఏదైనా పొరపాటున 22-A జాబితాలో నమోదై ఉంటే ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అటువంటి భూములను కూడా త్వరలో పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు మరియు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం" అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, అందుబాటులో ఉన్న పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సరిహద్దులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

●మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి సమీక్షలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ నియోజకవర్గం పరిధిలో:** కొనసాగుతున్న సాగునీటి పారుదల ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, పనులు పూర్తిచేయడంలో ఎదురవుతున్న సమస్యలపై మంత్రితో ఎమ్మెల్యే బాలు నాయక్ గారు చర్చించారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని కోరారు. దేవరకొండ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు తెలిపారు. సాగునీటి లభ్యత పెరగడంతో ప్రస్తుతం వర్షాధారంగా సాగు చేస్తున్న అనేక ప్రాంతాలకు భరోసా ఏర్పడుతుందని, సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటలను సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు మరియు భూగర్భ జలాలు కూడా మరింతగా సమృద్ధి చెందే అవకాశం ఉండటంతో దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని రైతుల చిరకాల సాగునీటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయి సాగునీరు అందుబాటులోకి వస్తే దేవరకొండ నియోజకవర్గం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల పనులకు అవసరమైన అనుమతులు, నిధులు మరియు ఇతర పరిపాలనా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# 22 ఏ భూముల అంశంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18:** 22-ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఎటువంటి ఆటంకాలు ఉండకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. ముఖ్యాంశాలు..
రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22-ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు 2 రోజుల్లో పరిశీలించి అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారు.
జిల్లా కలెక్టర్లు 22-ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించాను. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించాను.
ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళానికి కూడా ఇబ్బంది రానివ్వం.
22-ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు. ఎటువంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దు.

# విద్యార్థులకు అండగా పల్ రెడ్డి ఫౌండేషన్



**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి శంకర్‌పల్లి ఆగస్టు 18 చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి మండలం రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పల్ రెడ్డి ఫౌండేషన్, పల్ టేక్ సాఫ్ట్‌వేర్ సంస్థల ఆధ్వర్యంలో సుమారు రూ. 1.50 లక్షల విలువైన విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ తరఫున పల్ రెడ్డి రామ్ రెడ్డి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, జామెట్రీ బాక్సులు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చేవెళ్ల ఆర్డీఓ కె. పార్థ సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అందరి ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, మండల విద్యాధికారి రవీందర్ రావు, గ్రామ సర్పంచ్ సువర్ణ కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ సరిగా వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయులు జయసింహారెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, చంద్రశేఖర్ రెడ్డి, ప్రశాంతి, మోహన్ రెడ్డి, ఆనంద్, రేష్మ బేగం, చంద్రకళ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైలెంట్ కిల్లర్.. హెచ్చరిక లేకుండా నిశ్శబ్ద గుండెపోటు

గుండెపోటు...ఒకప్పుడు వయసు పైబడిన వారిలో మాత్రమే వచ్చేది. కానీ.. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, తీరిక లేమి, ఉరుకులు పరుగుల జీవితం, పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లు తదితర కారణాలతో వయసు తోనిమిత్తం లేకుండా గుండె సమస్యలు ఏర్పడటం, గుండెపోటు రావడం జరుగున్నది. మరో మాట చెప్పాలంటే ఈ మధ్య కాలంలో వృద్ధుల కంటే యుక్త వయసు వారే ఎక్కువగా గుండెపోటుకు గురవుతుండటం విచారకరం. గుండెపోటు అనగానే సాధారణంగా ఛాతీలో తీవ్రమైన నొప్పి, చెమటలు పట్టడం, ఊపిరి ఆడకపోవడం లాంటి స్పష్టమైన లక్షణాలు గుర్తుకు వస్తాయి. అయితే ప్రతి గుండెపోటులో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయని కచ్చితంగా చెప్పలేం. ఈ విధంగా లక్షణాలు లేకుండా వచ్చే గుండెపోటునే వైద్య పరిభాషలో 'సైలెంట్ హార్ట్ ఎటాక్' లేదా 'సైలెంట్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్' అంటారు. లక్షణాలు స్వల్పంగా ఉండటం లేదా అసలు కనిపించకపోవడం వల్ల చాలామంది దాన్ని గుర్తించకుండా నిర్లక్ష్యం చేసేఅవకాశాలు ఎక్కువగాఉంటాయి. ఫలితంగా చికిత్స ఆలస్యం కావడంతో గుండె కండరాలకు నష్టం జరిగే ప్రమాదం ఉంది. అసలు ఈ సైలెంట్ హార్ట్ ఎటాక్ అంటే ఏంటి...? ఇది ఎలాంటి రోగుల్లో వస్తుంది...? ఈనిశ్శబ్ద గుండెపోటుకు గల కారణాలేంటి...? దీని లక్షణాలు, నిర్ధరణ పద్ధతులు, చికిత్సా విధానం, ఈ సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి స్పీచ్..



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 18:** ఇది బహుజనుల తెలంగాణ. సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఇందిరమ్మ పాలనలో ఉందని నిరూపించాం. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన స్ఫూర్తిని పంచాలని చాలా కాలంగా గౌడ సోదరులు అడుగుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలో నెక్లెస్ రోడ్డుకు వెళ్లి పరిశీలించాను. అక్కడ జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని సూచించాను. ట్యాంక్ బండ్ పైన ఉన్న పర్యాటక కార్యాలయాన్ని కూల్చివేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని సూచించాను. పర్యాటకులు, సందర్శకులు ట్యాంక్ బండ్ పైకి వచ్చినప్పుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ దర్శనం జరిగి, ఆయన స్ఫూర్తి వారిలో నిండాలని కోరుకున్నాను. అందుబాటులో ఉంచాలి. విగ్రహం దగ్గర మంచి వెలుగుల ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇస్తున్నాను. తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రాధాన్యత ఉంటుంది. పండుగ సాయన్న పోరాటం, పౌరుషం పాలమూరు జిల్లాలో అందరికీ తెలుసు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ ప్రభుత్వం నాది కాదు. సామాజిక న్యాయం, సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం. ఈ ప్రభుత్వం అందరిది. బాలా గౌడ్, మల్లికార్జున్ గౌడ్ లాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఎదిగారు. మహేష్ గౌడ్ గాంధీభవన్‌లో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు నేను, భట్టి విక్రమార్క రాష్ట్రం అంతా పాదయాత్ర చేశాం. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్,



బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఆయన తన కులం, కుటుంబం కోసం మాత్రమే పనిచేయలేదు. బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారు. ఆయన స్ఫూర్తి ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు ఉండాలి. మహారాష్ట్రలో శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో బహుజనులు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారు. బ్రిటిష్ లైబ్రరీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విశేషాలు ఉన్నాయి. అక్కడి నుంచే మనం ఆయన చరిత్రను తెలుసుకున్నాం. బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు కాబట్టే ఆయనకు ఆ కీర్తి, గౌరవం దక్కింది. వందల ఏళ్లు గడిచినా ఆయనను తలుచుకుంటున్నామంటే ఆయన పోరాటం ఎంత అద్భుతమైనదో అర్థం చేసుకోవచ్చు. ఈ అద్భుతమైన విగ్రహాన్ని కాపాడుకునే బాధ్యత గౌడ సోదరులదే. నిత్యం స్ఫూర్తిని నింపేలా జాగ్రత్తగా ప్రజలకు ముఖ్యమంత్రిగా నేను మళ్లీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తాం. మళ్లీ అధికారాన్ని తీసుకువస్తాం. గౌడన్నలు నూటికి నూరు శాతం సహకరించాలి. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాను. ప్రభుత్వ పొలాల్లో ఈత, తాటి చెట్లు నాటేలా చూస్తాం. కాలువ గట్లపైన కూడా ఈత, తాటి చెట్లు నాటాలి. నల్గొండ జిల్లాలో గౌడలు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పదేళ్లు పరిపాలించిన వాళ్లు తమ దగ్గర ఉన్న అక్రమ సంపాదనతో మీడియా, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారు. బర్రెలు, గొర్రెలు పెంచుకోండి, చెప్పులు కుట్టుకోండి, చేపలు పట్టుకోండి అని గత ప్రభుత్వం చెప్పింది. మనం బర్రెలు, గొర్రెలు పెంచుకుంటుంటే వాళ్ల పిల్లలు రాజ్యాలు ఏలుతారని ఆనాటి ప్రభుత్వ పెద్దలు చెప్పారు. తరతరాలుగా అందివచ్చిన కులవృత్తి ఇది. దీనితోనే పిల్లలను చదివించుకున్నారు. ఆ వర్గాల పిల్లలు చదివి వైద్యులు, న్యాయవాదులు, ఐఏఎస్‌లుగా మారి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆనాడు నేను చెప్పాను. పిల్లల తలరాతలను మనం మార్చవచ్చు. ఈనాడు చైతన్యం వచ్చింది. చదువుకోవడం వల్ల మధు యాష్కీ గౌడ్ అమెరికా వెళ్లారు. రాజకీయాల్లోకి వచ్చి ఎంపీ అయ్యారు. కులవృత్తిని కొనసాగించండి, గౌరవించండి. కానీ పిల్లలను మాత్రం చదివించండి. విద్యార్థుల కోసం ఎన్ని కోట్లైనా కేటాయిస్తాం. నాణ్యమైన విద్యతో పాటు భోజనం కూడా ఇస్తాం. గతంలో సంక్షేమ



వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టలేదు. మా ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాం. నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నాం. పాలు, రాగిజావ పిల్లలకు ఇస్తున్నాం. మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువు ఒక్కటే పరిష్కారం. కష్టమైనా, నష్టమైనా పిల్లలను బడికి పంపించాలి. వాళ్లను చదివించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఏటీసీల్లో చేరేవాళ్లకు నెలకు రెండు వేల రూపాయల ఉపకార వేతనం ఇస్తున్నాం. గౌడ సోదరులకు యాభై వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశాం. ప్రమాదవశాత్తు గౌడ సోదరులు చనిపోతే ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నాం. ఈ ప్రభుత్వం మనది అని చెప్పండి. రెండోసారి 117 సీట్లు గెలుస్తున్నాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కొడుకు కేటీఆర్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుడిని చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మహేష్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని చేశాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే హరీష్ రావు, కేటీఆర్ ముఖ్యమంత్రులయ్యారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే పొన్నం, వాకిటి, సీతక్క, కొండా సురేఖ మంత్రులయ్యారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే సంతోష్ రావును రాజ్యసభకు పంపారు. నేను ముఖ్యమంత్రి అయితే అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపాను. వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపాను. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఓడిపోయిన వినోద్ రావును ప్రణాళికా సంఘం ఛైర్మన్ చేశారు. నేను కోదండరామ్‌ను ఎమ్మెల్సీని చేశాను. కేసీఆర్ సీఎం అయితే తన బిడ్డను ఎంపీ, ఎమ్మెల్సీ చేశాడు.. నేను వీరనారి చాకలి ఐలమ్మ మనుమరాలిని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించాను. కేసీఆర్‌ది కుటుంబ న్యాయం, నాది సామాజిక న్యాయం. కేసీఆర్‌ది దొరల న్యాయం, మాది సామాజిక న్యాయం. చెట్టుకు, పుట్టకు, రాయి, రప్పకు మొక్కుతున్నారు కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని. వందల ఎకరాల్లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మేం గ్రామ గ్రామాన ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం. కేసీఆర్ పదేళ్లలో కడితే ఇరవై లక్షల ఇళ్లు నిర్మాణం అయ్యేవి. కానీ ఆయనకు పేదోడి ఇంటిపై ఆలోచన లేదు. దిశ సరిగా లేకపోతే దశ సరిగా ఉండదు. ఈ ప్రభుత్వం మీది. ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలి. ప్రగతి భవన్, సచివాలయానికి ఎవరినీ రానివ్వలేదు. అందెశ్రీ పాటకు విముక్తి కల్పించాం. గద్దర్ పేరును శాశ్వతంగా నిలిపాం. బీసీ కులగణన చేశాం. ఎస్సీ వర్గీకరణ చేశాం. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నాం. ఎనిమిది లక్షల పదకొండు వేల కోట్ల అప్పు మాకు ముప్పుగా మారింది. ఏడాదికి డెబ్బై ఐదు వేల కోట్ల వడ్డీని కేసీఆర్ అప్పులకు కడుతున్నాం. ముప్పై ఆరు వేల కోట్ల రూపాయల రైతు భరోసా ఇచ్చాం. తొంభై ఐదు వేల కోట్ల రూపాయలతో ధాన్యం కొనుగోలు చేశాం. అరవై వేల కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలను మహిళా సంఘాలకు ఇచ్చాం. యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలలను ప్రతి నియోజకవర్గంలో రెండు వందల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం, క్రీడా అకాడమీని ప్రారంభించుకున్నాం. మేం చేసినవన్నీ చెబితే వాళ్లు ఇంట్లో నుంచి బయటకు రారు. చెబుతున్న అబద్ధాలను నమ్మడం లేదని కర్ణాటక, తమిళనాడుకు వెళ్లి అఘోరా రావు చేతబడి పూజలు చేయించి వచ్చాడు. కరువు రావాలని, రైతులు నష్టపోవాలని చేతబడి పూజలు చేస్తున్నారు. అధికారం కోసం ఇంతకు దిగజారుతారా? చేతబడి చేసేవాళ్లను చెట్లకు కట్టేసి కొట్టాలి. ఏది ఉన్నా మాట్లాడుకుని ముందుకు వెళ్దాం. ఈ ప్రభుత్వం మనది.



# కాన్హా ఆశ్రమం రహదారి వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం



**రంగారెడ్డి జిల్లా, భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు 18 చేవెళ్ల నియోజకవర్గం :** కాన్హా ఆశ్రమం రహదారి సమీపంలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు సమాచారం. మృతురాలి వివరాలు, ఆచూకీ తెలియాల్సి ఉంది. మహిళను ఎవరైనా గుర్తించినట్లయితే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. మృతురాలి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఈ సమాచారాన్ని గ్రామాల వారీగా ప్రజలకు చేరేలా సంబంధిత సమూహాల్లో పంచుకోవాలని కోరారు.

# నిమ్స్‌లో ప్రముఖ ఊపిరితిత్తుల మార్పిడి నిపుణుడు డాక్టర్ హరీష్ సీతామరాజు పర్యటన





**హైదరాబాద్, ఆగస్టు 18(భవిష్యత్ ప్రజాపాలన):** అమెరికాలోని న్యూయార్క్ మౌంట్ సినాయ్ ఆసుపత్రిలో లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమానికి మెడికల్ డైరెక్టర్‌గా,అంతర్జాతీయంగా ప్రముఖ ఊపిరితిత్తుల మార్పిడి మరియు అధునాతన ఊపిరితిత్తుల వైఫల్య నిపుణుడిగా సేవలందిస్తున్న డాక్టర్ హరీష్ సీతామరాజు మంగళవారం నిమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నిమ్స్‌లో అకడమిక్ టాక్ నిర్వహించడంతో పాటు, నిమ్స్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ బృందంతో వివిధ రోగుల కేసులపై సవివరంగా చర్చించారు. ఈ బృందంలో కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ విభాగానికి చెందిన డాక్టర్ అమరేష్ రావు, డాక్టర్ గోపాల్, పల్మోనాలజీ విభాగానికి చెందిన డాక్టర్ నరేందర్, డాక్టర్ రాకేష్, అనస్థీషియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ అర్చనతో పాటు ఫిజియోథెరపీ బృందం పాల్గొన్నారు. ఊపిరితిత్తుల మార్పిడి కోసం పరిశీలనలో ఉన్న రోగులను సమీక్షించిన డాక్టర్ హరీష్ సీతామరాజు, రోగుల ఎంపిక, శస్త్రచికిత్సకు ముందు ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడం, శస్త్రచికిత్స సమయంలో మరియు అనంతర సంరక్షణ, ఇన్ఫెక్షన్ల నివారణ, పునరావాసం, దీర్ఘకాలిక ఫాలోఅప్ తదితర అంశాలపై విలువైన సూచనలు అందించారు. ఈ పరస్పర చర్చలు నిమ్స్‌లోని వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రోటోకాల్ ఆధారిత లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గణనీయంగా దోహదపడ్డాయి.

# పాపన్న పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**●376వ జయంతి సందర్భంగా మన్నె గోవర్ధన్‌రెడ్డి ఘన నివాళులు**

**హైదరాబాద్:** సామాజిక అసమానతలపై పోరాడిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళలర్పించారు.

# భోజనం చేశాక పండ్లను తినాలా.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?

భోజనం తర్వాత పండ్లు తినడం ఆరోగ్యకరమైన అలవాటుగా చాలామంది భావిస్తారు. ముఖ్యంగా మామిడి, యాపిల్, బొప్పాయి వంటి పండ్లను భోజనం అనంతరం స్వీట్లకు ప్రత్యామ్నాయంగా తీసుకోవడం సాధారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో పులిసిపోయి గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తాయనే వాదనలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఈ వాదనల్లో వాస్తవం ఎంత? నిజంగా పండ్లను ఎప్పుడు తింటే మంచిది? నిపుణుల సూచనల ప్రకారం ఇలా ఉన్నాయి. భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో కుళ్లిపోతాయనే వాదనకు శాస్త్రీయ ఆధారం లేదు. మన కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉంటుంది.దీని ఆమ్లత్వం కారణంగా కడుపులో పండ్లు బ్యాక్టీరియాద్వారా పులిసిపోయే పరిస్థితి ఉండదు. అయితే పండ్లను కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు అధికంగా ఉన్న భోజనం తర్వాత తీసుకుంటే కడుపు ఖాళీ కావడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది.ఇది జీర్ణక్రియలో సహజమైన ప్రక్రియేతప్ప,ఏదైనా సమస్యకు సంకేతం కాదు.

**పీచు పదార్థంతో మేలు..**

పండ్లలో ఉండే కరిగే పీచు పదార్థం, ముఖ్యంగా యాపిల్, సిట్రస్ పండ్లలో లభించే పెక్టిన్, కడుపు నుంచి ఆహారం బయటకు వెళ్లే వేగాన్ని కొంత తగ్గిస్తుంది. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది.అలాగే ఆహారం లోనిపోషకాలు శరీరంలోకి క్రమంగా శోషించేందుకు ఇది సహాయపడుతుంది. వేగంగా రక్తంలో చక్కెర పెరగకుండా కూడా పీచు కొంతవరకు సహకరిస్తుంది.అయితే భోజనంతో పాటు లేదా వెంటనే పండ్లు తినడం వల్ల ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే వాటిలోని సహజ చక్కెరలు చిన్న ప్రేగులకు వేగంగా చేరుతాయి. భోజనం తర్వాత పండ్లు తింటే ప్రధాన ఆహారంలోని పీచు, ప్రోటీన్, కొవ్వు కారణంగా జీర్ణక్రియ కొంత నెమ్మదిస్తుంది. ఫలితంగా ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి ఇది సహాయ పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల విషయం లోనూ పండ్లను భోజనంతో కలిపి తీసుకోవడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా టైప్-2 మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు పండ్లను ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంత నియంత్రణలో ఉండే అవకాశం ఉంటుంది.

# ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు కు గవర్నర్కు ఆహ్వానం



**హైదరాబాద్, ఆగస్టు, 18(భవిష్యత్ ప్రజాపాలన):** హైదరాబాదులో రెండు రోజులు పాటు జరిగే ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభిస్తారు. మంగళవారం రోజు లోక్ భవన్లో గవర్నర్ శివప్రతాప్ శుక్ల ని ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసింది. జాతీయ స్థాయిలో జరిగే ఈ కాంక్లేవ్ ప్రారంభ ఆహ్వాన విందుకు హాజరవుతానని గవర్నర్ తన అంగీకారం తెలిపారు. జాతీయస్థాయిలో మీడియా పోకడలు ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల పనితీరుపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సందేశం ఇస్తారు. ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు గవర్నర్‌ని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఇదే సందర్భంగా గవర్నర్కు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీని పాలక మండలి అందజేసింది.గవర్నర్కు పూలమొక్కను అందజేసి సత్కరించారు. ఈనెల 21తేదీన తాజ్ కృష్ణ హోటల్లో జరిగే ఈ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందు కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. దేశం నలుమూలల నుంచి సీనియర్ జర్నలిస్టులు ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రెండు రోజుల సదస్సుకు హాజరవుతారు.

# నార్సింగిలో 21 అడుగుల అంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ





**నార్సింగి:** నార్సింగిలో 21 అడుగుల శ్రీ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు నార్సింగ్ అశోక్ యాదవ్, వెంకటేష్ యాదవ్, గుడిమల్కాపూర్ చైర్మన్ మల్లేశ్ ముదిరాజ్, వేణుగౌడ్, నార్సింగ్ మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీశ్రీ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీ అంజనేయస్వామి వారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మికతకు ప్రతీకగా 21 అడుగుల భారీ విగ్రహ ప్రతిష్ఠ జరగడం నార్సింగి ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు, స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంగా మారాయి.

# దేశభక్తికి ప్రతీక నేతాజీ సుభాష్ చంద్రబోస్



**●పద్మారావు నగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి నివాళులు**

**సికింద్రాబాద్, ఆగస్టు 18 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** భారత స్వాతంత్ర్య సమరంలో తనదైన పోరాట పంథాతో కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిలించిన మహానాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను పద్మారావు నగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్మరించుకున్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పద్మారావు నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు జగదీశ్వర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన త్యాగాలు, చూపిన తెగువ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. “మీరు నాకు రక్తం ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను” అనే పిలుపుతో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నేతాజీ ధైర్యసాహసాలను ఆయన గుర్తు చేశారు. దేశం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన నేతాజీ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. నేతాజీ కలలుగన్న స్వయం సమృద్ధి, బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రజలంతా ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సునీల్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ యాదవ్ చారి, మల్లం రమేష్, బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ ఏ. మహేష్, డీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొయ్యేటి రాజశేఖర్ రావు, కొండ్రు రమేష్ యాదవ్, దినేష్, సి. సునీల్, కే. వినయ్ కుమార్, హేమంత్, సుమన్, సి.హెచ్. శివకుమార్, వి. ప్రవీణ్ చారి, సి.హెచ్. వెంకటరెడ్డి తదితరులు పాల్గొని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.

### మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం..

# అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..



మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

### రైల్ కళారంగ్ బస్తీలో భక్తి శ్రద్ధలతో

# బోనాల ఉత్సవాలు



**సికింద్రాబాద్, ఆగస్టు 16 (భవిషత్ ప్రజాపాలన న్యూస్):** న్యూ బోయిగూడలోని కళారంగ్ కాలనీలో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయం లో జరిగే బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ప్రతి ఇంటినుండి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ముఖ్య అతిథిగా సనత్ నగర్ మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు జీ. పవన్ కుమార్ గౌడ్,వెంకటేశన్ రాజు హాజరయ్యారు. బోనాల ఉత్సవాల నిర్వాహకులు ఎ.గణేష్, వెంకట్, ప్రవీణ్ కుమార్, జితేందర్, కృష్ణ, రాజు, మురళీ, శంకర్,ప్రభు, రమణ, విఘ్నేష్, నర్సింగ్ రావు, బాలకృష్ణ, నరేందర్, జావేద్ పాల్గొన్నారు.అమ్మవారి విగ్రహంతో ఫలహారం బండిఊరేగింపులో రకరకాల వేషధారణలు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### మధురానగర్‌లో పర్యటించి డ్రైనేజీ సమస్యను

## పరిశీలించిన మాజీ కార్పొరేటర్ డా.సామల హేమ





**సికింద్రాబాద్, ఆగస్టు 18 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** మధురానగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు మాజీ కార్పొరేటర్ డా.సామల హేమ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె మధురానగర్‌లో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు.డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యకు గల కారణాలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకుని డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడైనా మట్టి, చెత్త పూడిక ఏర్పడితే ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డా. సామల హేమ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సలీమ్, బిఆర్ఎస్ నాయకులు శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఘటనను

# ఖండిస్తూ కాంగ్రెస్ ఎస్సీ విభాగం నిరసన

**సికింద్రాబాద్, ఆగస్టు 17 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు సంబంధించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు మేరకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బన్సీలాల్‌పేట్ డివిజన్ ఆర్పీ రోడ్డులో ఉన్న



డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఈ నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అడ్వకేట్ నరేన్ రాజా, సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు దాసరి శ్యామ్ సుందర్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ నరేన్‌రాజా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ప్రతిఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు క్రైస్తవ మైనారిటీ చైర్మన్, డీసీసీ సికింద్రాబాద్ నాయకులు దీపక్ జాన్ మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన మహానేతలపై అవమానకర వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మహానేత లకే ఇలాంటి పరిస్థితులు ఎదురైతే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాల్సిన అవసరం ఉందని ప్రశ్నించారు. ఏఐసీసీ ఎంఎస్ఎంఈ రాష్ట్ర అధ్యక్షులు శశాంక్ మాట్లాడుతూ దళితులపై వివక్షను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, దీపక్ జాన్, అడ్వకేట్ నరేన్ రాజా, దాసరి శ్యామ్ సుందర్, శశాంక్, ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి శివశంకర్, డివిజన్ అధ్యక్షులు రమేష్, ఎస్సీ విభాగం డివిజన్ చైర్మన్ మహేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలలో

# ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఘన నివాళి







**కంటోన్మెంట్, ఆగస్టు 18 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** బోయిన్‌పల్లి జయనగర్ బస్‌స్టాప్ వద్ద న్యూ బోయిన్‌పల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహుజన వీరుడు, విప్లవ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. బహుజన రాజ్య స్థాపన కోసం ఆయన చేసిన పోరాటం, ధైర్యసాహసాలు, త్యాగనిరతి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలు, సామాజిక సమానత్వం, ప్రజా సంక్షేమం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను యువత తెలుసుకుని, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. ఈ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, గౌడ సంక్షేమ సంఘం నాయకులు, యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# ఈరోజే ప్రెస్మీట్

### వారం రోజుల మిస్టరీకి తెర! కొండమల్లెపల్లి హత్యలో 10వ తరగతి విద్యార్థులే!



**●బెంచ్ నుంచి బెడీల దాకా... రూపా రెడ్డి హత్యలో స్కూల్ పిల్లల హస్తం**

**●చదవాల్సిన వయసులో ఘాతుకం! నల్లగొండను కలిచివేసిన కొండమల్లెపల్లి కేసు**

**●రూపా రెడ్డి హత్య వీడింది - నిందితులు ఎవరంటే ఊరే షాక్**

**●10th క్లాస్ పిల్లలే హంతకులా? వారం రోజులుగా వెంటాడిన ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు**

**●ఒకరు అరెస్ట్, మరొకరు పరారీ**

**●కారణం ఏంటనేది ఇంకా అంతుచిక్కని పురోగతీ పోలీసుల రాత్రింబవళ్లు శ్రమకు ఫలితం**

**దేవరకొండ /కొండమల్లేపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** వారం రోజులుగా నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి పట్టణాన్ని వణికించిన కల్లు రూపా రెడ్డి హత్య కేసులో పోలీసులు సంచలన వివరాలు వెల్లడించారు. ఈ ఘాతుకం వెనుక 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల హస్తం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గత వారం రోజులుగా రాత్రింబవళ్లు గాలించిన పోలీసులకు చివరికి కీలక ఆధారాలు లభించాయి. ఈ కేసులో ఒక విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, మరొక విద్యార్థి పరారీలో ఉన్నాడు. అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నారు. చదువుకోవాల్సిన వయసులో ఇంతటి



ఘాతుకానికి ఎందుకు ఒడిగట్టారనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. నిందితుల కుటుంబాల్లోను, ఊరిలోను తీవ్ర విషాదం నెలకొంది. పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా మీడియాకు వెల్లడించాల్సి ఉంది. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. నేరంలోకి లాగుతున్న అంశాలు ఏంటి? స్నేహం, ఒత్తిడి, లేక మరేదైనా కారణమా అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు

### విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా ?

# నిపుణులు ఏం చెబుతున్నారంటే..

ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు.

# భారత్ విజయం లాంఛనమే!!

**భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్**

**372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన**

**గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్**

**శ్రీలంక విజయానికి 288 పరుగులు**

**గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట**



శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రబాత్ జయసూర్య(3/43) మూడు వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం



భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో-క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉడారా ఇచ్చిన లో- స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో-క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



# శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.

# గాయత్రీ , శ్రీకాంత్‌లకు అర్జున అవార్డు..

**మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు**





కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. అర్జున అవార్డు గ్రహీతల జాబితాలో నిలిచారు. 1962 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత ఫుట్‌బాల్ టీమ్ సభ్యుడు ఐ. అరుమై నాయగం కు లైఫ్‌టైమ్ కేటగిరీలో అర్జున అవార్డు దక్కింది. కోచ్ లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డుల రెగ్యులర్ కేటగిరీలో అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్ ఎంపికయ్యారు. లైఫ్‌టైమ్ కేటగిరీలో బాక్సింగ్ కోచ్ ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్ కోచ్ వీరేందర్ కుమార్ లకు ద్రోణాచార్య దక్కింది. క్రీడల ప్రోత్సాహానికి కృషి చేసిన కార్పొరేట్, ఎన్జీవో విభాగంలో అందించే రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం పూణేకు చెందిన ఆర్మీ పారాలింపిక్ నోడ్ కు లభించింది. ఖేల్ రత్న అవార్డు లేకపోవడం మినహా మిగతా విభాగాల్లో పెద్ద సంఖ్యలోనే భారతీయ క్రీడాకారులకు గుర్తింపు లభించింది.

# లక్ష్యసేన్ శుభారంభం

**ప్రీ క్వార్టర్స్‌లో గాయత్రి, ట్రెసా జోడీ**

**బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్**



**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 14వ సీడ్, భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ తొలి రౌండ్లో గట్టెక్కాడు. మంగళవారం న్యూఢిల్లీలోని ఇంధిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆస్ట్రియా ఆటగాడు కొలిన్స్ వాలంటైన్ ఫిలిమాన్‌పై లక్ష్యసేన్ 16-21, 21-8, 21-4తో మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందాడు. తొలి గేమ్‌లో 16-21తో తడబడిన లక్ష్యసేన్ 15 నిమిషాల్లో కంగుతిన్నాడు. కానీ ఆ తర్వాత వరుస గేములను అలవోకగా 30 నిమిషాల్లోనే నెగ్గాడు. తొలి గేమ్, తర్వాతి రెండు గేమ్‌ల్లో భిన్నమైన ఆటతీరుతో లక్ష్యసేన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌ను విజయంతో మొదలెట్టాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా సైతం తొలి రౌండ్లో అలవోక విజయం సాధించింది. మయన్మార్ షట్లర్ తుజార్‌పై 22-20, 21-16తో ఉన్నతి హుడా 40 నిమిషాల్లోనే రెండో రౌండ్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి, ట్రెసా జోడీ 21-15, 21-12తో 16వ సీడ్ అమెరికా జోడీ లారెన్, అలిసన్‌లను వరుస గేముల్లో మట్టికరిపించి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. కవిప్రియ, సిమ్రన్ సింఘి జంట 7-21, 14-21తో రెండో రౌండ్ల నిరాశపరచగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో అసిత్ సూర్య, అమృత జోడీ 21-16, 29-30, 22-24తో పోరాడి ఓడింది. రోహన్ కపూర్, రుత్విక శివాని జంట సైతం 22-20, 10-21, 17-21తో మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడింది.

బుధవారం , ఆగస్టు 19 , 2026

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మల్లెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

----







# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ. 85 కోట్ల వసూళ్లను సాధించి, రూ. 100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

-------------

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.

# అనుపమ వ్యాఖ్యల ఎఫెక్ట్..

## తొలిసారి మౌనం వీడిన ధ్రువ్ విక్రమ్!



గత కొన్ని వారాలుగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై యువ నటుడు ధ్రువ్ విక్రమ్ తొలిసారి బహిరంగంగా స్పందించాడు. తన సహనటి అనుపమ పరమేశ్వరన్ గతంలో ఓ రెండేళ్ల సంబంధంలో తాను ఎదుర్కొన్న నియంతృత్వం, నార్సిసిజం గురించి మాట్లాడిన తర్వాత, ఆ వ్యాఖ్యలు ధ్రువ్‌ను ఉద్దేశించేనని పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే ధ్రువ్ మౌనం వీడాడు.'ఇండియా టుడే తమిళ్' నిర్వహించిన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ధ్రువ్‌ను.. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటున్నారని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కచ్చితంగా దాని ప్రభావం నాపై పడింది. కానీ, ఇలాంటి సమయంలో వాస్తవానికి కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం. మనం ఎవరో, మన విలువేంటో తెలుసుకోవాలి. మనం ప్రేమించే వారిని, మనకు ముఖ్యమైన ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలి" అని ఆయన అన్నారు. బయటివారి అభిప్రాయాల ప్రభావం తనపై ఎక్కువగా ఉండదని చెబుతూ, "మీరు నిజానికి కట్టుబడి ఉన్నప్పుడు, మిమ్మల్ని ఏది నిలబెడుతుందో మీకు తెలిసినప్పుడు, బయటివారి విమర్శలు ఓ స్థాయిని దాటి వెళ్లలేవు. మనకు తెలియకుండానే మనం ఒంటరి సైన్యంలా మారతాం. మనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని, మన అంతర్గత బలాన్ని కాపాడుకుంటాం" అని ధ్రువ్ వివరించాడు.ప్రముఖుల జీవితాల్లో ఇలాంటి పరిశీలన సర్వసాధారణమే అయినా, తన ప్రియమైన వారిని కాపాడుకోవడం, వ్యక్తిగత హద్దులు గీసుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నాడు. అయితే, ఈ సంభాషణలో ఆయన ఎక్కడా అనుపమ వ్యాఖ్యలను నేరుగా ప్రస్తావించలేదు. వారిద్దరి మధ్య ఏదైనా సంబంధం ఉందన్న ఊహాగానాలపై కూడా స్పందించకుండా సంయమనం పాటించాడు. ప్రస్తుతం ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ కలిసి 'బైసన్ కాలమాడన్' అనే చిత్రంలో నటిస్తున్నారు



# నిధి అగర్వాల్ కొత్త సినిమా..

## మైథలాజికల్ థ్రిల్లర్!

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది.సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888